క్లుప్తంగా

శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ఎమ్మెల్యే పూజలు



నరసరావుపేట: స్థానిక 24వ వార్డులోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఐదో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు పూజారులు, ఆలయ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాస రావు, పూనూరు కోటిరెడ్డి, దుగ్గెంపూడి కరుణాకరరెడ్డి, బీరం భాస్కర్‌రెడ్డి, శ్రీను, సుబ్బారావు, వార్డు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పొంగళ్ల సమర్పణ



వినుకొండ టౌన్: శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని కొండమెట్ల వద్దనున్న ఆలయ ఆవరణలో గురువారం 108 మహిళలు పొంగళ్లు పొంగించి సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు ప్రదక్షిణలు చేసి, పూజల్ని నిర్వహించారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

వరి, మొక్కజొన్న నూర్పిడి వెంటనే చేపట్టాలి



నరసరావుపేట రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి, మొక్కజొన్న నూర్పిడి త్వరత గతిన పూర్తి చేయాలని ఏడీఏ పి.మస్తానమ్మ రైతులకు సూచించారు. మండలంలోని ఇక్కుర్రులో గురువారం వ్యవసాయ అధికారులు పర్యటించి, వరి, మొక్కజొన్న పంటల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మొక్కజొన్న పంటను విక్రయించే రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య, వీఏఏ పావని, రవితేజ పాల్గొన్నారు.

కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య



ఈపూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్గొండ తండాలో గురువారం జరిగింది. ఎస్ఐ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. భూక్యా రమేష్‌నాయక్ (40)కు, అతని భార్యకు అప్పు విషయంలో మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రమేష్‌నాయక్ ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు విషయం తెలుసుకొని మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల తృతీయ సంవత్సరం బీఎస్సీ (ఎంపీసీ)లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాల్ని అందించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1986–89 విద్యా సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రస్తుత బీఎస్సీ విద్యార్థులు జి.చినపెద్దన్నకు రూ.5వేలు, పూనూరి ఆంజనేయులుకు రూ.3వేలు, ఐ.నాగమణికి రూ.2వేలు అందించారు. పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ పుట్టా శ్రీనివాసరావు సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, పూర్వ విద్యార్థులు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, ఎస్.ప్రసాద్, ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

20న నకరికల్లు తిరునాళ్ల

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఈనెల 20న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈనెల 5న నిర్వహించాల్సిన తిరునాళ్లను వర్షాల వల్ల వాయిదా వేసినట్టు వివరించారు. స్వామి కల్యాణం యథావిధిగా నిర్వహిస్తామని తిరునాళ్లను మాత్రం 16 రోజుల పండుగ సందర్భంగా 20న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కన్నుల పండువగా రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

యడ్లపాడు: మండలంలోని సొలసలో ఉన్న భూసమేత రంగనాయక స్వామి ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగో రోజు గురువారం ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో స్వామికి సుప్రభాత సేవ, బిందె తీర్థం, నిత్యార్చన, విష్ణు, లలిత సహస్ర నామార్చన, ఎదుర్కోలోత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపాన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హరిచందన, మరో నలుగురు చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు, సాయంత్రం ముగ్ధమనోరుడిగా అలంకారకృతుడైన రంగనాథుడు హంస వాహనంపై పురవీధుల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఎదురేగి పూజలు నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో జరిగిన కార్యక్రమాల్ని ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి బ్రదర్స్, ఈవో సీహెచ్. శివయ్య పర్యవేక్షించారు.



శాస్త్రీయ నాట్యం చేస్తున్న హరిచందన



ఎదుర్కోల ఉత్సవంలో స్వామి

భక్తిశ్రద్ధలతో నృసింహ జయంతి



చందన అలంకారంలో శ్రీయోగానంద లక్ష్మీ నారసింహస్వామి



ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నారసింహస్వామి

నరసరావుపేట ఈస్ట్: నృసింహ జయంతిని గురువారం పట్టణంలోని ఆలయాలలో వైభవంగా నిర్వహించారు. స్వామి శ్రీరాజ్యలక్ష్మీ సమేతుడై చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సత్తెనపల్లి రోడ్డు పులుపులవారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో ఉదయం మండపారాధన, కలశ స్నపన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌ను చందనంతో అలంకరించి భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. సాయంత్రం మల్లెపూలతో ఏర్పాటు చేసిన పూలంగి సేవలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బరంపేటలోని ఇస్కాన్ ఆలయంలో నృసింహ జయంతి వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శ్రీరాధ, గోవిందుల మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. శ్రీరాజ్యలక్ష్మీ సమేత నృసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, చందనంతో అలంకరించారు.

ఘనంగా జాలాది హరిహర క్షేత్రం వార్షికోత్సవం

యడ్లపాడు: మండలంలోని జాలాది హరిహర దత్తక్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. క్షేత్రం 22వ వార్షిక వేడుకలు గురువారంతో ముగిశాయి.. శైవ, వైష్ణవ ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్న ఈ దత్తక్షేత్రంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు ఆలయాల ప్రధాన అర్చకులు శివలింగ ప్రఫుల్లచంద్ర, పెద్ద అప్పాలాచార్యులు, చిన్న అప్పాలాచార్యులు అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతం, రుక్మిణీ సత్యభామ, వేణుగోపాలస్వామి, గంగాపార్వతి, చెన్నమల్లేశ్వరస్వామి శాంతి కల్యాణ వేడుకలు కన్నుల పండువలా జరిపారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చివరి రోజున ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.



నూతన వధూవరులుగా అలంకారకృతులైన చెన్నమల్లేశ్వరస్వామి, గంగాదేవి, పార్వతి

వైభవంగా ఆలయాల పునఃప్రతిష్ట

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలులో రూ.90 లక్షలతో నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పర్చూరి మాధవాచార్యులు, కౌశిక్ వెంకట రమణస్వామి బృందం ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర వైశాఖ మాస శుక్ల చతుర్ధశి చిత్త లగ్నమందు 7.19 గంటలకు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయంలో నందీశ్వరుడు, జీవధ్వజ స్తంభం, విమాన గోపుర కలశ ప్రతిష్ఠ, సీతాలాంబ (బొడ్డురాయి), నాలుగుదిక్కుల గవిడి రాళ్లు, శ్రీ పోలేరమ్మ అమ్మవారు, పోతురాజు, శ్రీ అంకమ్మతల్లి (గ్రామ దేవత) ఆలయాల పునఃప్రతిష్ఠ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 2నుంచి గ్రామంలో శాంతి హోమాలు, విగ్రహాల గ్రామోత్సవం, స్వామికి శాంతి కల్యాణం జరిపారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి మహిళల కోలాటం, భజనలు ఆకట్టుకున్నాయి.



ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదకాకాని: ఆరేళ్ల బాలిక (6)పై మైనర్ బాలుడు (16) అత్యాచారానికి పాల్పడిన సంఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెదకాకాని పోలీసులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గడ్డిపాడులో బుధవారం ఓ బాలిక ఇంటి నుంచి తినుబండారాలు కొనుక్కునేందుకు కిరాణా దుకాణానికి వెళ్లింది. ఈ సమయంలో వర్షం కురువడంతో బాలుడు తన ఇంట్లో గొడుగు ఉందిరమ్మని చెప్పి లోపలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

మూడు పంచాయతీలకు ఇన్‌చార్జి సర్పంచులు

బొల్లాపల్లి: మండలంలోని మూడు పంచాయతీలకు ఉప సర్పంచులు ఇన్‌చార్జి సర్పంచులుగా వ్యవహరించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి గురువారం తెలిపారు. పమిడిపాడు గ్రామ సర్పంచ్ కొత్త ఆదిలక్ష్మి సెలవుపై వెళ్లడంతో కొణతం బాలిరెడ్డి, మూగచింతలపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లవరపు దానమ్మ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిగా మాలపాటి అంజమ్మ, గుమ్మనంపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ నిమ్మల వెంకాయమ్మ సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో కటారి పుల్లమ్మ ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారని ఎంపీడీవో తెలిపారు. పంచాయతీల్లో తీర్మానాలు, అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.



గుమ్మనంపాడు సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పుల్లమ్మ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: మండలంలోని గురవాయపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ బాలనాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురవాయపాలెం గ్రామానికి చెందిన హైమాల మరియదాసు రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డు పక్కగా నిలబడ్డాడు. అదే సమయంలో పల్సర్ మోటార్ సైకిల్‌పై గోనెపూడి గ్రామానికి చెందిన కొయ్యలమూడి సుబ్బారావు(32) అతి వేగంగా నడుపుతూ వచ్చి మరియదాసును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ ద్వారా నరసరావుపేట వైద్యశాలకు తీసుకురాగా అప్పటికే సుబ్బారావు మృతి చెందాడని డాక్టర్లు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన మరియదాసును మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు ఆటోల ర్యాలీ

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు పట్టణంలోని కళామందిర్ సెంటర్ నుంచి ఆటోల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. మేడేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎ. ఆంజనేయనాయక్ పాల్గొంటారన్నారు. కళామందిర్ సెంటర్ నుంచి ర్యాలీ బయలుదేరి ఎన్ఆర్‌టీ సెంటర్ అడ్డరోడ్డు మీదుగా తిరిగి కళామందిర్ సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో అన్ని ఆటో స్టాండ్ల డ్రైవర్లు, యజమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

7న గిరిజన సంఘాల ఐక్యవేదిక సమావేశం

చిలకలూరిపేట: ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల ఏడో తేదీన సాయంత్రం 5గంటలకు పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో గల మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బి. శ్రీను నాయక్ తెలిపారు. ఎస్టీల సమస్యలు, రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి సంఘ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కీర్తి థియేటర్ వద్ద ఉన్న వినుకొండ శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8నుంచి జూన్ 16 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి భూక్యా బద్రినాయక్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో చదవడం మాకిష్టం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, డ్యాన్స్, చెస్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేటి నుంచి యడ్లపాడులో శిక్షణ తరగతులు

యడ్లపాడు: స్థానిక లూథరన్ హైస్కూల్లో శుక్రవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యడ్లపాడు అభివృద్ధి కమిటీ విద్యా విభాగం నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టులపై నిష్ణాతులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు హ్యాండ్ రైటింగ్, కథలు చెప్పడం, రాయడం, మట్టితో బొమ్మలు, పేపర్లతో ఆర్టికల్స్ తయారీ, సరదా ఆటలు, పాటలతో పాటు వివిధ రంగాల్లో పోటీలు, బహుమతులు ప్రదానం వంటి ఆసక్తికర కార్యక్రమాలు ఎన్నో ఉంటాయని వివరించారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు సామగ్రి కూడా ఉచితంగానే అందిస్తున్నట్లు తెలిపారు.

7న ఉచిత కంటి వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: స్నేహ హస్తాలు ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న మండలంలోని పెదరెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ ఫొటో స్టాట్ కాపీతో రావాలని సూచించారు. శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికైన వారికి వైద్యుల సలహాల మేరకు ఉచితంగా కంటి లోపల అద్దాన్ని అమరుస్తారని పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఘనంగా పోలేరమ్మ పాటి పాటేశ్వరమ్మ తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంటలో గురువారం పోలేరమ్మ పాటిపాటేశ్వరమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామున పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఏడు భారీ విద్యుత్ ప్రభల్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వేసవి సంగీత శిక్షణ తరగతులు

వినుకొండ టౌన్: పట్టణంలోని తల్లీపిల్లల వైద్యశాల సమీపంలోని ప్రతిభ గాన శిక్షణ కేంద్రంలో ఈ నెల 6నుంచి నెల రోజుల పాటు వేసవి సంగీత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు శిక్షకులు పి. రాజు గురువారం తెలిపారు. సంగీత పాఠా లు, భక్తి, దేశభక్తి గీతాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఏడు సంవత్సరాలు దాటిన చిన్నారుల పేర్లను 6వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 96762 59830 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు యడ్లపాడు శివాలయం వార్షికోత్సవం

యడ్లపాడు: స్థానిక గంగాపార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయం ఆరో వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. వేకువజామునుంచే వార్షిక పూజలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. భక్తులకు పలు రకాల తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

వార్డుల్లో డ్రెయిన్ల శుభ్రతకు ప్రత్యేక డ్రైవ్

నరసరావుపేట: వార్డుల్లో డ్రెయిన్లను శుభ్రం చేయించేందుకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఓలేటి శ్రీనివాసరావు వెల్లడించారు. పురపాలక సంఘం పరిధిలోని షాలెంనగర్, శ్రీనివాస్‌నగర్, బరంపేటలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 34 వార్డుల్లోని డ్రెయిన్లలో పూర్తిస్థాయిలో మట్టి తీయిస్తున్నట్లు చెప్పారు. వార్డు శానిటేషన్ సెక్రటరీలు కూడా దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, రామకోటయ్య పాల్గొన్నారు.



షాలెంనగర్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

నరసరావుపేట రూరల్: ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఏపీవో కట్టా నాగేశ్వరరావు సిబ్బందికి చెప్పారు. మండలంలోని కాకానిలో పనుల్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలు ఎండ వేడిమికి గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కూలీలకు రోజుకు రూ.270 వచ్చేలా కనీసం నాలుగు గంటలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వేముల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్స్ మరియబాబు, తిరుపతిరావు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఏపీవో నాగేశ్వరరావు

పంట నష్టాన్ని అంచనా వేయండి

నకరికల్లు: అకాలవర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి సత్వరమే నివేదిక పంపాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చల్లగుండ్ల, దేచవరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. అకాలవర్షానికి తడిసిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ అకాలవర్షానికి, ఈదురుగాలులకు వాలిన, తడిచిన ధాన్యం సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దిలీప్‌కుమార్, రవిబాబు, కె.హనుమంతరావు, వీఆర్వో యువరాజు రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు నష్టం

అచ్చంపేట: మూడురోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. తాళ్లచెరువు, అచ్చంపేట, కొత్తపల్లి, తదితర గ్రామాలలో సుమారు 200 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట వేశారు. పంట బాగానే పండింది. ధరకూడా ఒక మోస్తరుగా ఉండటంతో రైతులు సంబరపడిపోయారు. కోత కోసి కండె నుంచి విత్తనాలను వేరుచేసి కల్లాలలో ఆరబెట్టిన తరువాత అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం తడిసిపోవడంతో ధర సగానికి సగం పడిపోయే పరిస్థితి ఏర్పడిందని, పెట్టుబడులు కూడా వచ్చే ఆస్కారం కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి రైతులకూ వర్షం నిరాశను మిగిల్చింది. మూడో కోతగా వచ్చిన మిర్చి మొత్తం కల్లాలలోనే ఉండిపోయింది. వర్షానికి పట్టాలు కప్పినా కిందనుంచి వర్షపు నీళ్లు పోవడంతో కాయలు మొత్తం మట్టికొట్టుకుపోయాయని రైతులు చెబుతున్నారు. తడిసిన పంటనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



చల్లగుండ్లలో పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తదితరులు

వీహెచ్‌పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్

సత్తెనపల్లి: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మంగళగిరి రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ సమక్షంలో గురువారం సత్తెనపల్లిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం. సుభాని, ఉపాధ్యక్షుడిగా దూదేకుల మస్తాన్ వలి, అధికార ప్రతినిధిగా ఎం.యల్లమందను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని వివరించారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

రొంపిచర్ల: మండలంలోని ఎడ్వర్డ్‌పేటలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉత్సవాలు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 5 గంటలకు యంత్రశిల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమాల్ని బ్రహ్మశ్రీ కోట వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రతిష్ఠకు సిద్ధమైన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం